ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మహబూబాబాద్
బుధవారం 17 జనవరి 2024



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

ఎన్ని'కల'లో..!



- పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్న పలువురు
- కాంగ్రెస్ నుంచి నలుగురు, బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు
- కొలువులు చేస్తున్నవారు సైతం ఆసక్తి..
- వరుసగా కొత్తవారికే 'మానుకోట' పట్టం

పార్లమెంట్ బరిలో కొత్త ముఖాలు..?

మహబూబాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రధాన అధికార, ప్రతిపక్ష పార్టీల్లో కొత్త ముఖాలు రంగంలో దిగడానికి ఉవ్విళ్లూరుతున్నాయి. ఎస్టీ రిజర్వ్‌డ్ మహబూబాబాద్ ఎంపీ సీటు కోసం పాతవారితో పాటు కొత్తవాళ్ల మధ్య పోటీ తీవ్రంగా కన్పిస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీల్లో తెరంగేట్రం చేయడానికి వివిధ శాఖల్లో ఉన్నతాధికారులుగా కొనసాగుతున్న వారితో పాటు ప్రముఖ రంగాల్లో పనిచేస్తున్న రాజకీయ ఔత్సాహికులు పోటీ చేయడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. అవకాశమిస్తే ఉద్యోగాలకు వీఆర్‌ఎస్ తీసుకుంటామని అగ్రనేతల వద్ద స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. దశాబ్దకాలం తర్వాత స్వరాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ, ప్రధాన ప్రతిపక్షంగా మారిన బీఆర్‌ఎస్‌లోనూ కొత్తవారు టికెట్ ఇస్తే పోటీకి సిద్ధమని పార్టీ పెద్దలను కలిసి వస్తున్నారు.

మూడు ఎన్నికల్లోనూ కొత్తవారే..

మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు కొత్త ముఖాల సందడి ఆరంభమైంది. పార్టీ టికెట్ తెచ్చుకుంటే చాలు.. విజయం ఖాయమన్న భావన కాంగ్రెస్ పార్టీ ఆశావహుల్లో కన్పిస్తోంది. బీఆర్‌ఎస్ ఆశావహుల్లో సైతం జయాపజయాల మాట అలా ఉంచితే.. బరిలో దిగితే రానున్న కాలంలో నియోజకవర్గాల పునర్విభజనలో ఎక్కడో ఓ చోట బెర్త్ ఖాయం చేసుకోవచ్చన్న ఆలోచనలో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కేంద్రంలో మూడోసారి హ్యాట్రిక్ కోసం అగ్రనేతల వ్యూహాల నేపథ్యంలో గతంలో పార్లమెంట్‌కు పోటీ చేసిన వారు కొంత కాలం తెరచాటుకు వెళ్లినా, మళ్లీ పోటీలో దిగాలని ఉత్సాహం కనబరుస్తున్నారు. స్వరాష్ట్ర సాధనకు ముందే జాతీయస్థాయిలో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో మహబూబాబాద్ ఎంపీ స్థానం ఎస్టీ రిజర్వ్‌డ్‌గా ఆవిర్భవించిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన పోరిక బలరాంనాయక్ కేంద్రమంత్రిగా ప్రాతినిధ్యంలోకి వచ్చారు. రెండోసారి జరిగిన ఎన్నికల్లో ఉద్యమ పార్టీ బలంతో బీఆర్‌ఎస్ నుంచి ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ అధికారం చేపట్టారు. మూడోసారి కూడా ఇదే తరహాలో బీఆర్‌ఎస్ నుంచి మాలోతు కవిత ఎంపీ అయ్యారు. వరుసగా కొత్త వారికి అవకాశం కల్పిస్తూ వస్తున్న పార్లమెంట్ సెగ్మెంట్‌లో కొత్త వారు రంగంలో దిగితే విజయం ఖాయమన్న సెంట్‌మెంట్‌తో ఈ రెండు పార్టీల్లోనూ కొత్త ముఖాలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీ నుంచి..

మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రధానంగా నలుగురు కొత్తవారు ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. స్వరాష్ట్రం ఆవిర్భావ తొలినాళ్లలో మానుకోటలో డీఎస్పీగా పని చేసిన ఖమ్మం పట్టణానికి చెందిన దుంగ్రోత్ నాగరాజునాయక్ ఒకవైపు ప్రభుత్వ విధులు నిర్వహిస్తూనే.. మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. రాష్ట్రంలోనే సంపూర్ణ గుడుంబా రహిత డివిజన్‌గా మార్చేందుకు ఆయన చేసిన కృషి క్షేత్రస్థాయి ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. ఆ క్రమంలోనే ఎన్నికల్లో దిగుతారన్న ప్రచారం అప్పట్లోనే జోరందుకుంది. మొత్తానికి రాజకీయ కారణాలు ఆయనను ఇక్కడ్నుంచి స్థానచలనానికి కారణమయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్ ఏఐసీ (అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) అడ్మిన్‌గా కొనసాగుతున్న ఆయన 2023 జూన్, జూలైలోనే వీఆర్‌ఎస్ (వాలంటరీ రిటైర్‌మెంట్ సర్వీసు)కు దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నతాధికారులు రిజెక్ట్ చేసినప్పటికి మరోసారి వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకుని, కాంగ్రెస్ నుంచి మహబూబాబాద్ పార్లమెంట్ సీటు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్‌గా పని చేసిన జనగామ జిల్లాకు చెందిన లకావత్ ధన్వంతి భర్త అయిన డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్ కూడా మహబూబాబాద్ కాంగ్రెస్ సీటును ఆశిస్తున్నట్లు సమాచారం. ఇటీవలనే మహబూబాబాద్ శివారు అనంతాద్రి వద్ద నిర్వహించిన ఒక సామాజికవర్గ భేటీలో పలువురు కులసంఘాల నేతలను లక్ష్మీనారాయణ కలుసుకుని, ఎన్నికల్లో పోటీ విషయమై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. పూర్వంలో పాలకుర్తి జనరల్ స్థానం నుంచి పోటీకి టికెట్ ఆశించిన ఆయన 2009, 2014, 2019 ఎన్నికల్లో అధిష్ఠానం సూచనలతో వెనక్కి తగ్గినట్లు సమాచారం. పార్టీలో సీనియర్ నేతగా ఉన్న ఆయనకు ఈ నియోజకవర్గ నేతల్లో మద్దతు లభిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఉద్యమ సమయంలో ఓ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా గుర్తింపు పొందిన భట్టు రమేష్ ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా కొనసాగున్నప్పటికి పార్లమెంట్ ఎంపీ టికెట్ కోసం ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. అలాగే సంగారెడ్డిలో ఎస్పీడీసీఎల్ డీఈగా కొనసాగుతున్న మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్టకు చెందిన ఎట్టి వెంకన్న ఆయన ఫాలోవర్స్ ఇటీవలనే జిల్లా పార్టీ అధ్యక్షుడు భరత్‌చందర్ రెడ్డిని కలిసి ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరడంతో ఆదివాసీ సామాజికవర్గం నుంచి కూడా పోటీ ఉన్నట్లు తేటతెల్లమవుతోంది.

బీఆర్‌ఎస్ నుంచి..

బీఆర్‌ఎస్ విషయానికొస్తే ఖమ్మం జిల్లా మాజీ శాసనసభ్యుడు లావుడ్యా రాములునాయక్ కుమారుడైన ఐఆర్‌ఎస్ జీవన్‌లాల్‌నాయక్ ఇటీవలనే అధిష్ఠానాన్ని కలిసి మహబూబాబాద్ టికెట్‌ను ఆశించినట్లు ప్రచారం జరుగుతోంది. కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ అధికారిగా ఉన్న ఆయన అవకాశం ఇస్తే వీఆర్‌ఎస్ తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో రాములునాయక్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే విషయంలో బీఆర్‌ఎస్‌లో రాజకీయ సమీకరణాలతో చేజారిన నేపథ్యంలో ఆయన తనయుడికి భవిష్యత్‌లో అవకాశం ఇస్తామని అధిష్ఠానం నుంచి హామీ ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మరోపక్క స్వరాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తొర్రూరు మండలం వెలికట్టే శివారు చెడ్లంకుంట తండాకు చెందిన మాలోతు బిక్షపతినాయక్ ఎప్పట్నుంచో మహబూబాబాద్ అసెంబ్లీ టికెట్ ఆశిస్తూ వస్తున్నారు. బీఆర్‌ఎస్ అగ్రనేతలైన తన్నీరు హరీశ్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో సత్సంబంధాలు కలిగిన బిక్షపతినాయక్ ప్రస్తుతం వరంగల్ డివిజన్‌లో ఎల్ఐసీ డీవోగా పని చేస్తున్నారు. తెలంగాణ వికాస్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గిరిజన విభాగం కన్వీనర్‌గా పార్టీలో గుర్తింపు పొంది ఉన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త దివంగత ప్రొఫెసర్ జయశంకర్, బియ్యాల జనార్ధన్ రావు, కాళోజీ నారాయణ రావు లాంటి మహోన్నత వ్యక్తులతో కలిసి ఉద్యమంలో క్రియాశీలపాత్ర పోషించి ఉన్నారు. అవకాశం ఇస్తే మహబూబాబాద్ నుంచి పోటీ చేస్తానని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసి ఉన్నారు. ఏదేమైనా మహబూబాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ ఆవిర్భావం నుంచి వరుసగా కొత్తవారికే పట్టం కడుతూ.. వస్తున్న క్రమంలో ప్రధాన పార్టీలు తీసుకునే నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే!

సంక్షేమ ఫలాలతోనే ఆర్థిక ప్రగతి

- పాఠశాలల్లో వసతుల కల్పనపై దృష్టి సారించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, జనవరి16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిరుపేదల ఆర్థిక ప్రగతిని పెంచేందుకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బలోపేతం కావాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాలు, మైనార్టీ, గిరిజన సంక్షేమం, గురుకులాలు ఐటీడీఏ, కేంద్రీయ విద్యాలయాల్లో అమలు పరుస్తున్న విద్యాప్రగతి, మౌళిక వసతుల కల్పనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాప్రగతిని పెంచేందుకు పాఠశాలల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలకు ప్రణాళికల రూపొందించుకోవాలని, అవసరమైన చోట ట్రైనర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు పాఠశాలల్లో వసతి గృహాలను సందర్శించి, తనిఖీ చేయాలన్నారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పో, జిల్లా అధికారులు సన్యాసయ్య, నర్సింహాస్వామి, శ్రీనివాస్, రాధాకృష్ణ, ముఖేష్‌కుమార్, బాలరాజు, రాజు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై దృష్టి సారించాలి..

గంగారం మండలంలో నీతి ఆయోగ్‌తో ప్రగతి కన్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కేంద్రప్రభుత్వం ద్వారా నీతి ఆయోగ్ ఏడు అంశాల కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను అడిగి, తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యంపై ప్రధాన దృష్టి పెట్టాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయో! లేదో? క్షుణ్ణంగా పరిశీలించాలని, మండలసమావేశాన్ని నిర్వహిస్తూ నివేదికలను కోరాలన్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల దృష్టి పెట్టాలని, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పనితీరును సమీక్షించాలన్నారు. గత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ, వైద్య కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్లు, మరుగుదొడ్లు, నీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రవాణా, కమ్యూనికేషన్ రంగాల మెరుగుదలకు కావాల్సిన చర్యలు చేపట్టాలని ఉపాధి కల్పన కోసం యువతలో నైపుణ్యాలను మరింత మెరుగు పరిచేందుకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో, జిల్లా అధికారులు సన్యాసయ్య, సుబ్బారావు, నర్మద, రామారావు, సూర్యనారాయణ, గంగారం ఎంపీడీవో అపర్ణ పాల్గొన్నారు.

'పనులను త్వరగా పూర్తి చేయాలి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 : మిషన్ భగీరథ పనులను త్వరగా పూర్తి చేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయిరాంమోహన్‌రెడ్డి సూచించారు. మానుకోట పట్టణంలో మంగళవారం గాయత్రిగుట్ట వద్ద నిర్మిస్తున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్, నిర్మాణ పనులను, ఏటిగడ్డ తండా వద్ద ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ స్టోరేజ్, మోటార్ల పనితీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడంతో తరుచుగా నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. పనుల్లో వేగం పెంచి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. ఫిల్టర్‌బెడ్ వద్ద లీకేజీలు కాకుండా చూసుకోవాలని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా తగుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, వార్డు కౌన్సిలర్ దండెబోయిన బుజ్జి వెంకన్న, మిషన్‌భగీరథ ఇంజనీర్లు రాజేష్, కృష్ణ, మునిసిపల్ సిబ్బంది రాంచంద్రు, సురేష్ పాల్గొన్నారు.

క్రీడారంగంలో అగ్రస్థానంలో నిలపాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు


జాతీయస్థాయి సౌత్‌జోన్ బేస్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 16 : జిల్లాను క్రీడారంగంలో అగ్రస్థానంలో నిలపాలని డీఈవో రామారావు సూచించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జాతీయస్థాయి బాలబాలికల సౌత్‌జోన్ సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి 14 వరకు జనగామలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించటం అభినందనీయమన్నారు. మానుకోట మండలం వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి సౌత్‌జోన్ బేస్‌బాల్ పోటీలో దీపిక, వైష్ణవి పాల్గొన్ని బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయిలో పేరునిలిపారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే క్రీడాస్పూర్తిని కొనసాగిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురా వాలన్నారు. క్రీడల్లో రాణించడం వలన మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సంజీవరావు, ప్రేమ్ కుమార్, జిల్లా బేస్‌బాల్ సెక్రటరీ ప్రభాకర్‌రావు, సోహెల్ అభినందించారు.

సల్లంగ సూడు మల్లన్న

మచ్చర్లలో మల్లికార్జునస్వామి కల్యాణం

- కన్నుల పండుగగా వేడుకలు
- జాతరకు పోటెత్తిన భక్తులు

వివరాలు 8లో..

ఇంటింటా సంక్రాంతి

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- ముంగిళ్లలో రంగవల్లులు.. గంగిరెద్దుల విన్యాసాలు
- పతంగులను ఎగురవేసిన చిన్నారులు
- కన్నుల పండువగా గోదారంగనాథుల కల్యాణం
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 16 : సంక్రాంతి పర్వదినాన్ని జిల్లా ప్రజలు సోమవారం ఆనందంగా జరుపుకున్నారు. పట్టణాలతో పాటు పల్లెల్లో ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఇళ్లన్నీ బంధుమిత్రులతో కళకళలాడాయి. సంక్రాంతి పండుగ రోజు తెల్లవారుజామున ఇంటి ముంగిట వాకిళ్లలో మహిళలు రంగురంగుల ముగ్గులను వేశారు. వాటిలో గొబ్బెమ్మలు, నవధాన్యాలు, రేగుపండ్లు, ముగ్గుపువ్వు, బంతిపూలను పెట్టారు. ఉదయాన్నే తలంటూ స్నానాలు ఆచరించి, నూతన దుస్తులు ధరించిన మహిళలు, చిన్నారులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పల్లెలు, పట్టణాల్లో చిన్నారులు పతంగులను ఎగుర వేస్తూ ఆనందంగా గడిపారు.

గ్రామాల్లో వ్యవసాయానికి ఉపయోగించే పశువులు, గోవులను నీటితో కడిగి బంతిపూలు కట్టి ప్రత్యేకంగా పూజలను చేశారు. సంక్రాంతి రోజున గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు అలరించాయి. డూడూ బసవన్నల విన్యాసాలతో గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజలు సంక్రాంతికి తమ స్వస్థలాలకు చేరుకుని ఆనందోత్సాహాల నడుమ కుటుంబసభ్యులతో పండుగ పర్వదినం జరుపుకోవడంతో పల్లెలు, పట్టణాల్లో సందడి నెలకొంది.

శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మకరజ్యోతి రోజున నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు గుణనిధి వేదమంత్రోచ్చరణల నడుమ వైభవంగా జరిపించారు. ఈ కల్యాణ మహోత్సవంలో బాపురెడ్డి, మధుకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మొగిలి ప్రసాద్, కొల్లూరి రవి, శ్రీలత, ఉష, శ్రీదేవిపాల్గొన్నారు.

- మానుకోట పట్టణంలోని 16వ వార్డులో సీపీఐ నేతృత్వంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు నగదు పారితోషికంతో పాటు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథి, పమ్మి కృష్ణమూర్తి, అశోక్, రాజమౌళి, రాజు, తల్లాడ శ్రీదేవి, సల్మాజీ, మాదారపు కవిత, సింధు, భవాని, నూకల గీత, సునీత, రేషపల్లి సుస్మిత, రమ్య, రేషపల్లి నవీన్, పెరుగు కుమార్, మంద శ్రీను, రేషపల్లి తరుణ్, సురేష్, వెలుగు శ్రవన్, రమేష్ గోపి, కిషోర్, అనిల్, సాయి, శ్రీను, యశ్వంత్, అఖిలష్, శ్రీకాంత్, శ్యాంప్రసాద్, వెంకటేష్, కృష్ణ మూర్తి, శంకరయ్య, వెంకన్న పాల్గొన్నారు.


మానుకోటలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పగిడిపల్లిలో మాట్లాడుతున్న డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్


మహబూబాబాద్‌లోని 16వ వార్డులో ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీపీఐ శ్రేణులు

వివిధ మండలాల్లో..

- చిన్నగూడూరు మండలం పగిడిపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్ బహుమతులు అందజేశారు. గునిగంటి కమలాకర్, సుధగాని నాగేష్, మారబోయిన వెంకటేశ్వర్లు, బిక్కునాయక్, జహింగీర్ పాల్గొన్నారు.
- మరిపెడ మండలం అబ్బాయిపాలెంలో అంబేద్కర్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, జిన్న లచ్చయ్య, తీగల లలిత, సుజాత, ఉపేందర్, ఉదయ్, దిలీప్, మధు, స్టాలిన్, రాజు, చింటూ, చరణ్, గణేష్ పాల్గొన్నారు.
- మరిపెడ మునిసిపల్ కేంద్రంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో పతంగులు ఎగురవేసి సంబరాలు జరిపారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. వాసవిక్లబ్ మండల అధ్యక్షుడు గ్రైపల్లి వెంకన్న పాల్గొన్నారు.
- డోర్నకల్ మండలం ఉయ్యాలవాడలో తాళ్లూరి గంగాధర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి ఎస్సై యూనస్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. తాళ్లూరి రామయ్య, హనుమ, గాలం గట్టయ్య, పెద్దిని నర్సింహారావు, మెదరమెట్ల సత్యనారాయణలు పాల్గొన్నారు.
- నెల్లికుదురు మండల కేంద్రంలో కాకతీయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ,

మిగతా 8వ పేజీలో..





మహాజాతర అభివృద్ధి పనులపై ఆరా

- మేడారంలో వేర్వేరుగా పర్యటించిన కలెక్టర్, పీవో, అదనపు కలెక్టర్
- త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశం

మేడారం, జనవరి 16 : మేడారాన్ని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ వేర్వేరుగా పర్యటించారు. మహాజాతర జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యంత్రాలు, నిర్మాణ సామగ్రి, కూలీల లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. జంపన్నవాగు నుంచి ఊరట్టం స్తూపం వరకు ప్రతిపాదిత పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సీ1, సీ2 పార్కింగ్ కోసం సుమారు 95 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. గ్రౌండ్ లెవలింగ్‌ను సక్రమంగా చేపట్టి వారంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, పైప్‌లైన్ల ఏర్పాటు, మహిళలు బట్టలు మార్చుకునే గదుల నిర్మాణం, ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత, వాగులో ఇసుక చదును పనులను కలెక్టర్, పీవో పరిశీలించారు. మేడారం పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు అధిక సంఖ్యలో కార్మికులను వినియోగించాలన్నారు. వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలంలో కాజ్‌వే పనులను పరిశీలించారు.

అనంతరం ఐటీడీఏ అతిథిగృహంలో శాఖల వారీగా అధికారులతో చర్చించారు. ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీవో అంకిత్



హముతండాలో ట్రాక్టర్‌లో మృతదేహాలు

హముతండాలో విషాదం

నలుగురి దుర్మరణం ఘటనతో గ్రామస్థుల కన్నీరుమున్నీరు



కంబాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్లావత్ శ్రీను కుటుంబం (ఫైల్)

గూడూరు, జనవరి 16: విధి వైపరీత్యం అంటే ఇదేనేమో..! జిల్లాలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. దేవుడిని దర్శించుకుని వస్తూ అనంతలోకాలకు వెళ్లిపోవడంతో హము తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ గిరిజన కుటుంబాన్ని బలితీసుకుంది. ఆటోను కారు ఢీకొని జరిగిన ప్రమాదంలో తల్లి, కుమారుడు, ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు మండలం హముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను, అతని తల్లి పాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికతో పాటు బావమరిది సంతోష్ (సర్దార్), అత్త శాంతిలతో కలిసి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ దగ్గర బుడియబాపు ఆలయానికి ఆటోలో వెళ్లారు. అక్కడ రిత్విక్ పుట్టువెంట్రుకలు సమర్పించి తిరిగి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి బయలు దేరారు. మహబూబాబాద్‌కు చెందిన కారు గుంజేడు నుంచి మహబూబాబాద్‌కు వైపువస్తూ ఎదురు వస్తున్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇస్లావత్ శ్రీనుతోపాటు తల్లిపాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అత్త శాంతి, బావమరిది సర్దార్ తీవ్రంగా గాయపడ్డారు. వారికి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. కాగా, మూడు సంవత్స రాల క్రితం శ్రీను భార్య సంధ్య (శిరీష) కొవిడ్‌తో మృతి చెందింది. సంక్రాంతి పండుగ వేళకుమారుడి పుట్టువెంట్రుకలు ఇచ్చి వస్తూ రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో హముతండాలో విషా దఛాయలు అలుముకున్నాయి. కాగా, సోమవారం నలుగురి మృతదేహాలకు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాలను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ నివాళ్లర్పించారు. జిల్లా జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

అత్తారింటికి వచ్చిన వ్యక్తిపై దాడి

తీవ్ర గాయాలపాలైన యువకుడు



తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తుమ్మ దీపక్‌రెడ్డి

పెద్దవంగర, జనవరి 16: మండలంలోని కొరిపెల్లిలో ఓవ్యక్తిపై దాడి చేయగా, తీవ్ర గాయాలపాలయ్యాడు. మంగళవారం ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలరానికి చెందిన తుమ్మ దీపకొరెడ్డి- మహేశ్వరి దంపతులు కుమార్తె రిషితతో కలిసి సంక్రాతి పండుగ సందర్భంగా సోమవారం కొరిపెల్లిలోని అత్తగారైన నీరటి నాగమ్మ ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేసిన తర్వాత మిత్రులతో కలిసి బయటకు వెళ్లగా, పెద్దచెరువు సమీపంలో దీపకొరెడ్డిపై అదే గ్రామానికి చెందిన సాకి యాకయ్య, అతని కుమారులు సాయికుమార్, మహేష్, రాములు అనే నలుగురు వ్యక్తులు కత్తులు, కర్రలతో దాడి చేయడంతో ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో దీపకొరెడ్డిని బంధువులు, గ్రామస్థులు చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేయిట్ తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హన్మకొండకు తరలించారు. అయితే పాత కక్షలతోనే ఈ దాడికి పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. కాగా, దీపకొరెడ్డి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐలోని మల్లన్న.. సల్లంగ సూడు..

● మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు ● మహానివేదనతో మార్నేనియుల దేవుడి రథం ఊరేగింపు

ఐనవోలు, జనవరి 16: పూసల లాగులు.. గజ్జెల మోత.. డోలు శబ్దాలు.. చేతుల్లో వీరకోలు.. త్రిశూలాలు.. ఖడ్గాలు.. నొదుటిపై బండారి పసుపు.. నెత్తిపై బోనాలు.. అందులో వెలుగుతున్న దీపాల మధ్య గుంపులు గుంపులుగా జానపద గేయాలతో శివసత్తులు నృత్యాలు చేస్తున్న దృశ్యాలు.. ఐలోని మల్లన్న ఆలయంలో భక్తిపారవశ్యాన్ని ప్రతిబింబించాయి. ఇక ఒగ్గు పూజారుల అందమైన పిండి పట్నాలు ఢమురక శబ్దాలతో భక్తులకు స్వామి వారి కృప కలగాలని స్తుతించారు. సకం భాగ్యాలు కలిగి సంతోషాన్ని కలిగించి.. ముట్టింది ముచ్చమై.. పట్టింది బంగారమై.. పాలి వాడు దగ్గరై.. పగవాడు దూరం కావాలంటూ.. పర్వతాల మల్లయ్య మా పాలిట కలిగి ఉంటూ.. సల్లంగా సూడు మళ్లీ వస్తాం..' అంటూ స్వామి వారిని వేడుకున్నారు.

పోటెత్తిన భక్తజనం

ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతరలో భక్తులు పోటెత్తారు. సంస్కృతి, సంప్రదాయాలు, జానపదులకు ప్రతీక అయిన బండారితో మల్లన్న క్షేత్రం పసుపుమయమైంది. సోమవారం సంక్రాంతి పర్వదినం రోజున రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి మొదలైన భక్తుల రాక.. అర్ధరాత్రి వరకు రద్దీగా కొనసాగింది. ఐలోని మల్లన్న.. అంటూ స్వామివారిని కీర్తిస్తూ పరవశించిపోయారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, బిల్వార్చన మహానివేదన నీరాజన పుణ్యాహవాచనము పూజలు జరిపారు. మల్లికార్జునస్వామికి వెండి కిరీటం, కవచం సుగంధాలు వెదజల్లే పుష్పమాలతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి తెల్లవారువరకు అభిషేకాలు దర్శనాలు జరిగాయి.

మహానివేదనతో దేవుడి రథం

మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథంను డీసీసీబీ చైర్మన్ దంపతులు మార్నేని మధుమతి - రవీందర్ రావు స్వగృహంలో సుందరంగా తీర్చిదిద్దారు. మార్నేని వంశీయులు ఆధ్వర్యంలో మహానివేదనతో బయలుదేరిన రథం గ్రామ పురవీదుల గుండా ఆలయానికి చేరుకొని మూడుసార్లు ప్రదక్షణ చేసింది. మంగళహారతులతో రథానికి మహిళలు స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రభ బండ్లు రథాన్ని అనుసరించాయి. దేవుడి రథం ప్రదర్శన సాయంత్రం 7నుంచి తెల్లవారువరకు కొనసాగింది. రథంతో వచ్చిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు దంపతులను ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీసభ్యులు సంప్రదాయపద్ధతిలో సన్మానించారు.



ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు



మహానివేదనతో ఆలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్న మార్నేనియుల పెద్దరథం

7లక్షల మంది భక్తుల దర్శనం

ధ్వజారోహణం రోజు నుంచి సోమవారం వరకు సుమారు 7లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారుల అంచనా వేశారు. 17న సంప్రోక్షణ క్రతువు తర్వాత ఉగాది వరకు జరిగే వారాంతపు జాతరలు ప్రతీ ఆది, బుధవారాల్లో లక్షల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి దర్శనం చేసుకుంటారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కుటుంబ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు నేతృత్వంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలు బహూకరించి తీర్థ ప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు.

అధికారుల సేవలు

జాతరలో పోలీసుసేవలు భేష్‌గా నిలిచాయి. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు నేతృత్వంలో పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ద్వారా సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా నీడన జాతర బందోబస్తును డీసీపీ, ఏసీపీలు పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్సైలు సుమారు 500మంది విధులు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లాలు జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వసతులు కల్పించారు. జీడబ్ల్యూఎంసీ పారిశుధ్య సిబ్బందితోపాటు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్(గ్రామ పంచాయతీ) సిబ్బంది నాలుగు రోజులపాటు నిర్విరామంగా విధులు నిర్వహించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈ సునీత ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ ఏర్పాటు చేసిన ట్యాంకర్లు, నల్లాలు ద్వారా మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేశారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్‌లైన్ శాఖల ఆధ్వర్యంలో 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీస్‌ల ఆధ్వర్యంలో తప్పిపోయిన పిల్లలు, వృద్ధుల కోసం సహాయ శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ - ఐనవోలు - కొమురవెల్లి- ఆర్టీసీ బస్సులు ద్వారా భక్తులను చేరవేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు వైద్యసేవలు అందించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు జాతరలో ప్రత్యేక నిఘా పెట్టారు. రెండు రోజులు ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచారు.



గజ్జెల లాగు పూసల అంగిలో మల్లన్న భక్తుడు



ఐనవోలు మల్లికార్జున ఆలయం ఆవరణలో బోనంతో నృత్యం చేస్తున్న శివసత్తి



స్వామిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ దయాకర్, కుటుంబసభ్యులు



స్వామి వారి సన్నిధిలో మాజీ మేయర్ దంపతులు స్వర్ణవరదరాజేశ్వర్‌రావు

23 నుంచి కేయూ ఇంజనీరింగ్ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 16: ఈ నెల 23 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 25, 27, 29, 31,ఫిబ్రవరి 2, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, డెటాసైన్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని ఇంజరింగ్ కళాశాల, కేయూ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పరీక్షల నియంత్రణాధికారులు సూచించారు.

19న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, జనవరి 16: ఈ నెల 19వ తేదీన హనుమకొండ ములుగు రోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సెస్ బ్యాంకులో సుమారు 80 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 28 యేళ్ల మధ్య వయస్సు గల ఇంటర్, ఏదైనా డిగ్రీ చేసిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9848895937, 9700922136లో సంప్రదించాలని తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



గునిగంటి తిరుపతి (ఫైల్)

ఎల్కతుర్తి, జనవరి 16: తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడి అక్కడికక్కడే గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దండేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గునిగంటి తిరుపతి (42) వృత్తిలో భాగంగా తాటి కల్లు గీయడానికి వెళ్లాడు. గ్రామ శివారులోని పెద్ద చెరువు కట్ట కింద ఉన్న చెట్టు ఎక్కి కల్లుగీస్తున్న క్రమంలో మోకు జారీ పైనుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుజురాబాద్ సివిల్ అస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సరిత, కుమార్తె రక్షిత, కుమారుడు సాత్విక్‌లు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు తిరుపతి కుంటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

పురుగుల మందుతాగిన వ్యక్తి మృతి

నర్సింహులపేట, జనవరి 16 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన వంతడుపలలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి (48) గ్రామ రెవెన్యూ పరిధిలో రెండేళ్ల కిందట కోళ్లఫామ్ ఏర్పాటు చేసుకుని నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో కోళ్లఫామ్‌లో ఆశించిన మేరకు లాభాలు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. తెచ్చిన అప్పులు రెట్టింపుకావడం, భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేవి. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 3న క్రిమిసంహారక మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి తొర్రూరు ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి పెద్దకుమారుడు కార్తీక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

19 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, జనవరి 16: మండలంలోని బోటిమీదితండా శివారు కొండెంగెలగుట్ట తండాలో ఓ ఇంట్లో నిల్వ చేసిన 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 క్వింటాళ్ల పటికను మంగళవారం పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. కొండెగల గుట్ట తండాకు చెందిన బానోత్ చిన్నమాలు తన ఇంట్లో 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 కింటాళ్ల పటిక నిల్వచేసి తండావాసులకు విక్రయిస్తున్న క్రమంలో పట్టుకొని సీజ్ చేసి బానోత్ చిన్న మాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ పేర్కొన్నాడు.



మేడారంలో వనదేవతలను దర్శించుకున్న భక్తులు

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారంలో భారీగా భక్తజనం

మేడారం, జనవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం కిక్కిరిసిపోయింది. మకర సంక్రాంతి, కనుము పండుగల నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర జరగనున్న నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరకొని వనదేవతలకు పూలు, పండ్లు, చీరె సారె, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం (బంగారం) సమర్పించారు. యాట మొక్కులను చెల్లించుకున్నారు. ఈ రెండు రోజులో సుమారు 2 లక్షలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా..

మాజీ మంత్రి ఈటల రాజేందర్

భీమదేవరపల్లి, జనవరి 16: బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తానని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కొత్తకొండలో విలేకరులతో మాట్లాడుతూ.. తాను కరీంనగర్ మట్టి బిడ్డనని, కరీంగనర్‌లో పలుమార్లు మంత్రిగా పనిచేశానన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అప్పుడు పని చేశానన్నారు. కరీంనగర్ ప్రజలతో తనకు విడదీయరాని అను బంధం ఉందన్నారు. కానీ కరీంనగర్‌లో తమ సిట్టింగ్ ఎంపీ ఉన్నారన్నారు. దీంతో పార్టీ ఆదేశిస్తే ఎంపీగా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం తాము వ్యతిరేకం కాదని, కానీ దీంతో పేదలైన ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా ప్రభుత్వం చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పృథ్వీరాజ్‌గౌడ్, మాచర్ల కుమార్, అంబీరు కవిత, గోదాల సంపత్, గుండెల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తా...

మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

భీమదేవరపల్లి, జనవరి 16: పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తానని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. కొత్తకొండ జాతరలో సోమవారం వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రంలోని తమ పార్టీ న్యాయకత్వాన్ని ఎదురించి తెలంగాణను సాధించామన్నారు. తాను వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో చిచ్చు పెట్టి పబ్బం గడుపుతోందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం పేరుతో ప్రజాస్వామ్యాన్ని మోదీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనుకయ్య, నాయకులు ఆదరి రవిందర్, కొల్గూరి రాజు, రవీందర్, డబ్బా శంకర్, మడిపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ రుత్విక్‌సాయికి తెలంగాణ కేడర్



హనుమకొండ రూరల్, జనవరి 16: గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో 558వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన కొట్టె రుత్విక్ సాయికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కేడర్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ రాంనగర్‌కు చెందిన రుత్విక్‌సాయి ఐపీఎస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన 460వ ర్యాంకర్ పత్తిపాక సాయికిరణ్‌కు కూడా తెలంగాణ కేడర్ దక్కింది.

జై వీరభద్రా..

● భక్త జన జాతరగా మారిన కొత్తకొండ
● మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్
● ఆకర్షణగా నిలిచిన ఎడ్లబండ్ల రథాలు.. మేకల బండ్లు

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది.. ఎటు చూసినా క్యూలైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుడి నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపొయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కుమార్, వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝూ, డీసీపీ బారీ, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీ వంగ రవి, సర్పంచ్ దూడల ప్రమీల - సంపత్, ఎంపీటీసీ యాటపోలు రాజమణి-శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్‌రావులు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు.

ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో విశిష్టమైన సేవలందించారు. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగామ, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపడం, ప్రైవేట్ వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన భక్తులతో జాతర మొత్తం కిటకిటలాడింది. భక్తుల రద్దీతో కొత్తకొండ వీధులన్నీ భక్త జనంతో నిండిపోయాయి. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝూ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ భారీ, ఏసీపీ డేవిడ్ రాజు, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 400మంది పోలీసులు జాతరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరను విజయవంతంగా పూర్తి చేసిన పోలీసు అధికారులు తిరిగి తమ విధుల్లోకి చేరేందుకు వెళ్లారు.

ప్రత్యేక పూజలు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. స్వామివారికి కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా పూజలు నిర్వహిస్తే సమస్త పీడల నుంచి విముక్తి కలిగి భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. మంగళవారం నాడు నాగవెల్లి, పుష్ప యాగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నల్లపూసలను అలంకరింపజేశారు. అనంతరం పుష్పోత్సవం నిర్వహించారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

మొక్కులు చెల్లించిన లక్షలాది మంది భక్తులు

కొత్తకొండ దేవాలయంలో మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని సోమ, మంగళవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. మకర సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో భక్తులతో ఆలయం మొత్తం కిటకిటలాడగా క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో రాత్రి వేళల్లోనే జాతర ఎక్కువ సాగేది. అలాంటిది ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు

కొత్తకొండ జాతరకే కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు. మూడురోజులుగా రైతులు కష్టపడి తమ ఎడ్లబండ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది జాతరకు తీసుకొచ్చారు. 65 ఎండ్లబండ్ల రథాలను సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఇంటికి వెళ్లిపోయాయి. అందమైన ఎడ్లబండ్లను చూసేందుకు జాతరకు వచ్చిన భక్తులు ఆసక్తిగా చూశారు. వీటితో పాటు వేలాది ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాయి. వేలేరు గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు పలువుర్ని ఆకట్టుకున్నాయి. కొన్నేళ్లుగా మేకలబండ్లు వేలేరు నుంచి రావడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం అర్ధరాత్రి మేకల బండ్లు రావడంతో ఆలయ అధికారులు వాటిని ఆలయం ముందుకు తీసుకవచ్చారు. ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామాల సునీతలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వీరభద్రస్వామి



భద్రకాళి అమ్మవారు

పారిశుధ్యం భేష్

కొత్తకొండ జాతరలో పారిశుధ్య సేవలు భేష్‌గా ఉన్నాయి. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఆధ్వర్యంలో జాతరలో అధికారుల సేవలను పరిశీలించారు. డీపీవో జగదీశ్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవోలు నాగరాజు, రవి పర్యవేక్షణలో పారిశుధ్య సేవలు రాత్రి పగళ్లు అందించారు. సుమారు 40మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, 150మంది కార్మికుల సిబ్బందితో ఆలయం చుట్టూ, పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్మికులు 24గంటలు చెత్తను తొలగించారు. ప్రతీ దుకాణం ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. జాతరలో చెత్తాచెదారం, చెడిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు.



వేలేరు నుంచి వచ్చిన మేకల రథం



శ్రీవీరభద్రస్వామిని దర్శించుకుంటున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా



గండదీపంలో నూనె పోస్తున్న యువతులు

మైనార్టీ పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 16 : జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 5 మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 8 వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్ http://tmres.telangana.gov.in అర్హతగల సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 98859 83942, 73966 91373లను సంప్రదించాలన్నారు.

కిష్టాపురం తండాలో గడ్డివాముల దగ్ధం

కేసముద్రం, జనవరి16 : అర్పనపల్లి శివారు కిష్టాపురంతండాలో సోమవారం అర్ధరాత్రి దాటిన అనంతరం గడ్డివాములకు నిప్పంటుకొని, దగ్ధమయ్యాయి. తండాకు పక్కనే రాళ్లమధ్యన బానోత్ ఉమ్లా, లావుడ్యా దేవ్‌సింగ్, భీమాలకు చెందిన 10 ఎకరాల గడ్డి వాములను మూడు పక్కపక్కనే వేర్వేరుగా ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమైనట్లు బాధితులు ఆరోపించారు. ఈ ఘటనలో సుమారు రూ.60వేల విలువైన గడ్డి దగ్ధమైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కేసముద్రం, జనవరి 16 : కేసముద్రం విలేజి సమీపంలోని మూలమలుపు వద్ద మంగళవారంలారీ, మోటార్ సైకిల్ ఢీకొనడంతో వరంగల్ రామన్నపేటకు చెందిన సంద్రగిరి బాలరాజుకు తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ వంశీధర్ తెలిపారు. కేసముద్రం నుంచి వరంగల్ వైపునకు మోటార్ సైకిల్‌పై బాలరాజు వెళుతుండగా మూలమలుపు వద్ద ఎదురుగా కేసముద్రం వైపునకు వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం అధికంగా జరిగింది. స్థానిక 108 అంబులెన్స్ అందుబాటు లో లేకపోవడంతో ఎస్‌ఐ వంశీధర్ ఘటన స్థలానికి చేరుకొని తన వాహనంలో మహబూబాబాద్‌కు తరలించారు. మార్గమధ్యలో గూడూరు నుంచి 108 వాహనం రాగా బాలరాజును 108లో అత్యవసర చికిత్స అందిస్తూ మహబూబాబాద్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కేసముద్రం, జనవరి 16 :బేరువాడ శివారు బోడమం చ్యాతండాలో బోడ నవీన్ తన గొర్రుతో బురదపొలం దున్నుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. తన పొలంమడిని దుక్కిటెడ్లను కట్టిన గొర్రుతో దున్నుతున్నాడు. పొలం గట్టుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరుకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో ఆ ప్రాంతంలో దున్నుతుండగా ఒక్కసారిగా ఒక ఎద్దు కిందపడి గిలాగిలా కొట్టుకుంది. మరో ఎద్దుకు విద్యుదాఘాతం స్వల్పంగా తగలడంతో ఎగిరి పక్కకు దూకి దూరంగా పరిగెత్తింది. ఇది గమనించిన రైతు సైతం దూరంగా జరిగి విద్యుత్ సరఫరా బంద్ చేయించడంతో అతనికి ప్రాణాపాయం తప్పినట్లయింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.70 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే ఎద్దు మృతి చెందిందని బాధిత రైతును ఆదుకోవాలని తండాకు చెందిన పలువురు కోరారు.

పామాయిల్ పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

గూడూరు, జనవరి 16 : సీతానగరం శివారు ఆదివారం పేటలో సోమవారం భూక్య ఈర్యకు చెందిన పామాయిల్ తోటను అడవి పందులు ధ్వంసం చేశాయి. మూడెకరాల విస్తీర్ణంలో భూక్య ఈర్య పామాయిల్ చెట్లను సాగు చేస్తున్నాడు. ఈర్య వ్యవసాయ క్షేత్రం అటవీకి దగ్గరగా ఉండడంతో రాత్రి వేళల్లో పంట క్షేత్రంలోని పామాయిల్ మొక్కలను ధ్వంసం చేశాయి. దీంతో సదరు రైతు అటవీశాఖ, రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

'విద్యార్థులు లక్ష్యం దిశగా చదువుకోవాలి'



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

తొర్రూరు, జనవరి 16 : విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని చదువుకోవాలని పద్మశాలి సంఘం, పోపా నాయకులు కోరారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో పద్మశాలి కమ్యూనిటీకి చెందిన నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అమ్మ హాస్పిటల్ డాక్టర్ గడ్డం రాజు హాజరై మాట్లాడుతూ పద్మశాలి విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, ప్రతిభ గల పేదవిద్యార్థులను ఆర్థికంగా ఆదుకునేందుకు పద్మశాలి సంఘం, పోపా అండగా ఉంటుందన్నారు. డివిజన్ పరిధిలోని పెద్దముప్పారానికి చెందిన పొన్నం నాగేశ్వరి బాసర ఐఐటీలో సీటు సాధించగా ఆమెకు రూ. 41, 500, మరిపెడకు చెందిన కారంపూడి ఉషశ్రీ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో నర్సింగ్ చేస్తున్న నేపథ్యంలో ఆమెకు సంఘం తరపున రూ.26,500 ఆర్థిక సాయం అందించామని తెలిపారు. సంఘం నాయకులు బుధారపు శ్రీనివాస్, గడ్డం ఈశ్వర్, కె.సోమశేఖర్, కూరపాటి సోమయ్య, శంకర్, రవీంద్ర కుమార్, సురేష్, వెంకటేశ్వర్లు, పులేందర్, బాస్కర్, నాగేశ్వర్, ఉమేష్, వెంకట్ ఉన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్

డోర్నకల్, జనవరి 16 : డోర్నకల్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలునాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాచంద్రునాయక్ హాజరై మాట్లాడారు. తొలుత పంచాయతీ రాజ్ డీఈ మహేష్‌బాబు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎస్డీఎఫ్ కింద మంజూరు అయిన పనులను నిలిపి వేయాలని ప్రభుత్వం ఆదేశించిందని సభా దృష్టికి తీసుకువచ్చారు. కాగా, డోర్నకల్ ఐకేపీ కార్యాలయాన్ని డాక్టర్ రాంచంద్రునాయక్ సందర్శించారు. తొలుత సెర్ప్ ఏపీఎం శంకర్‌నాయక్, సీసీలు కవిత, రాధ, మంజుల, నళిని, స్వర్ణలతతో పాటు వీవోఏలు ఎమ్మెల్యేను సన్మానించారు. డోర్నకల్ సెర్ప్ కార్యాలయ భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తానని చెప్పారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎస్సీ, ఎస్టీ టీచర్స్ యూనియన్, నాయీ బ్రహ్మణసంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సర్వసభ్య సమావేశంలో డోర్నకల్ తహసీల్దార్ నాగభవాణి, ఎంపీడీవో చలపతి రావు, జడ్పీటీసీ కమల, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'ప్రజల సొమ్ముకు జవాబుదారీగా ఉండాలి'

డోర్నకల్ మునిసిపల్ సర్వసభ్య సమావేశం మంగళవారం చైర్మన్ వాంకుడోతు వీరన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొందరు కౌన్సిలర్లు మునిసిపాలిటీలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. దీంతో ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులకు జవాబుదారీగా ఉండి వారికి కావాల్సిన అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈనెల 23న మరోసారి మునిసిపల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మున్వర్‌ఆలీ, డిప్యూటీ తహసీల్దార్ వీరన్న, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సల్లంగ సూడు మల్లన్న



మల్లికార్జున స్వామికి కల్యాణం జరిపిస్తున్న యాదవ కులపెద్దలు

గూడూరు, జవవరి 16 : మచ్చర్ల మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భోగి రోజున ఒగ్గుపూజారులు మేలుకొలుపు నిర్వహించారు. మహా గణపతిపూజ, పుణ్యాహవచనం, హోమం, తీర్థప్రసాదములు అనంతరం ఒగ్గు కథతో కాలక్షేపం, మైలలు తీసే కార్యక్రమాలను నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం రోజున మల్లికార్జున స్వామికి పట్నం వేయుడం, కల్యాణ మహోత్సవ వేడుకలను అత్యంత వైభవోపేతంగా జరిపించారు. బోనాలు, పట్నం తొక్కుట, దీక్ష విరమణ, తీర్థప్రసాదములు, ఎల్లమ్మతల్లివద్ద కథ, కాలక్షేపము, మైలలు తీసే కార్యక్రమం చేపట్టారు. సంక్రాంతి కనుమ మంగళవారం రోజున ఎల్లమ్మతల్లికి పట్నం, బోనం, మేకపోతును మత్తుకొలుపుట, బద్దిపోచమ్మ తల్లికి బోనం, పట్నం తొక్కుట, ఉత్సవ ముగింపు వేడుకలను నిర్వహించారు. జాతరకు పిల్లలుపుట్టని మహిళలు వచ్చి మల్లికార్జునస్వామికి వరం పట్టారు. సంతానం యోగ్యం కలగాలని మహిళలు మల్లికార్జునస్వామి కల్యాణ ఉత్సవంలో తలస్నానం చేసి ధ్వజస్తంభం ముందు తడి బట్టలతో ప్రదిక్షిణలు నిర్వహించి వరం పట్టారు. మల్లికార్జునస్వామికి మొక్కులు చెల్లిస్తే సంవత్సరంలోపే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. యాదవసంఘ ప్రతినిధులు మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహూకరించారు. జాతర అభివృద్ధి కోసం సీడీఎఫ్ నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గూడూరు సీఐ ఫణిదర్ దం పతులతో వచ్చి మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దగొల్ల కాడబోయిన నర్సయ్య, సారగొల్ల అవుల రాములు, వెంకటేష్, మల్లయ్య, యాకయ్య, వెంకన్న, ఉప్పలయ్య, మల్లేష్, కాడబోయిన సతీష్ పాల్గొన్నారు.

జనసంద్రం.. నర్సింహాస్వామి జాతర

పెద్దవంగర, జనవరి 16 : మండలంలోని గంట్లకుంటలోని ఏనే నర్సింహాస్వామి నామస్మరణతో సోమవారం ఆలయ ప్రాంగణం మార్మోగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భక్తులు రెట్టింపు సంఖ్యలో జాతరకు తరలివచ్చారు. ఒక్క రోజు జరిగే జాతరకు చుట్టు ప్రక్కల గ్రామాలు, మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సర్పంచ్ చింతల భాస్కర్, జీపీ పాలకవర్గం, యూత్ వాలంటీర్లు, పోలీసులు సేవలు అందించారు. రావుల కర్ణాకర్, యాకయ్యల సహకారంతో భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందజేశారు. స్థానిక ఎస్సై పిల్లల రాజు, సర్పంచ్ చింతల భాస్కర్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు పాలకుర్తి యాదగిరిరావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ అనురాధ, యూత్ నాయకులు పాల్గొన్నారు.

'భారత్‌జోడో న్యాయయాత్రను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న గుగులోతు దస్రూనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 : ఏఐసీసీ అధినాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో న్యాయయాత్రను జయప్రదం చేయాలని టీపీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ డీసీసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ జోడోన్యాయయాత్ర విజయవంతంపై చర్చించేందుకు ఈనెల 17న గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ సమావేశం ఉంటుందని, దీనికికాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్‌మున్షి, ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్, డిప్యూటీ సీఎం మల్లుబట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, గిరిజన ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని తెలిపారు. గ్రామాల ఎస్టీసెల్ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్, శంకర్, నారాయణ, కోమల్, సురేష్, బాలు పాల్గొన్నారు.

'ప్రమాదానికి కారకులను అరెస్టు చేయాలి'

- మృతుడి బంధువుల ఆందోళన

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 : కంబాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబాబాద్ అండర్ బ్రిడ్జి వద్ద కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. హముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను, అతని కుమారుడు రిత్విక్ పుట్టు వెంట్రుకలు తీసేందుకు నల్గొండ జిల్లా నాగార్జున్‌సాగర్ దగ్గర బుడియబాపు ఆలయానికి ఇస్లావత్ శ్రీను, తల్లి పాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్విక, అత్త మాలోతు శాంతి, బామ్మర్ది సర్దార్(సంతోష్)లు ఆటోలో వెళ్లారు. పుట్టు వెంట్రుకలు సమర్పించి తిరిగి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరారు. కంబాలపల్లి అర్బన్ పార్కు సమీపంలోకి రాగానేఆటోను ఢీకొట్టారని చెప్పారు. ఈ ఘటనలో తమ కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేంత వరకు ఆందోళన విరమింప చేసేదే లేదని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ ఆందోళన చేస్తున్న ప్రాంతానికి వచ్చి వారితో మాట్లాడారు. తప్పకుండా మీకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రమేష్‌నాయక్, ఫణిదర్, ఎస్సైలు రామారావు, శివ, రాణాప్రతాప్, ఏఎస్సై రాణాప్రతాప్ బందోబస్తు నిర్వహించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 : కంబాలపల్లి శివారు అర్బన్‌పార్క్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలోని మార్చురిగదిలో కంబాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురు మృతదేహాలను సోమవారం సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ ఈ రోడ్డు ప్రమాద ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించి ఆర్థికంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, బానోత్ ప్రసాద్‌నాయక్, షేక్.రియాజ్ అన్సారీ, ఎండి.హరున్, అరుణ్‌నాయక్ ఉన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి జిల్లా ఆస్పత్రికి చేరుకుని మృతుని కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఉన్నారు.

ప్రమాద కారకులపై చర్యలు తీసుకోవాలి

మాజీమంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత

మహబూబాబాద్ రూరల్ : కంబాలపల్లి శివారు అర్బన్ పార్క్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి కారులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోతు కవిత అన్నారు. జిల్లా అస్పత్రి మార్చురీలో ఉన్న మృతదేహాలను సోమవారం సందర్శించి నివాళ్లర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగరోజున ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధకరమన్నారు. ప్రమాదానికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం ఉన్నారు.

బయ్యారంలో ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

బయ్యారం, జనవరి 16 : కుటుంబంలో తలెత్తిన ఘర్షణ నేపథ్యంలో మనస్థాపం చెందిన బయ్యారం మండల కేంద్రానికి గ్రామానికి చెందిన ఓ వివాహిత వల్లపు వీరమ్మ (52) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం

బయ్యారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో వల్లపు వెంకన్న, వీరమ్మ కుటుంబం నివాసముంటుంది. వీరికి ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అయితే వెంకన్న కుటుంబం తమ వృత్తిరీత్యా జీవనోపాధి నిమిత్తం ప్రతీ ఏడాది హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలోనే తమ కులానికి చెందిన చిట్టీపాట నిమిత్తం వెంకన్న కుటుంబ సభ్యులు సంకాంత్రి పండుగకు ముందు బయ్యారం వచ్చారు. ఇటీవలనే తమ చిన్న కుమారుడు గణేష్ వివాహం నిశ్చయమవగా, సోమవారం లగ్నకోటు (పెళ్లి ముహూర్తం) రాసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఏమి జరిగిందో ఏమో తెలియదు కాని మనస్తాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో వీరమ్మ ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బయ్యారం పీహెచ్‌సీకి తరలించేలోపే మృతి చెందినట్లు సమాచారం. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా, చిన్న కుమారుని పెళ్లికి కొద్ది రోజుల ముందు తల్లీ వీరమ్మ ఆత్మహత్యకు పాల్పడటంతో ఆ ఇంట తీరని విషాదం నెలకొన్నది.

మున్నూరుకాపు పరపతి సంఘం కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం సభ్యులు

తొర్రూరు, జనవరి 16 : తొర్రూరు పట్టణ మున్నూరు కాపు పరపతి సంఘం నూతన కమిటీని మంగళవారం డివిజన్ కేంద్రంలోని పాటిమీదగల దేవాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డివిజన్ అధ్యక్షుడు జలగం శ్రీనివాస్ తెలిపారు. మున్నూరు కాపు పరపతి సంఘం అధ్యక్షుడిగా కొమ్ము దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా మూల శేఖర్, కోశాధికారిగా నలుగు నర్సయ్యతో పాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశామన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని, తమపై నమ్మకం ఉంచి ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. సభ్యులు పుల్లయ్య సంపత్, శివ, గోపి, సుకన్య, భాస్కర్, నవీన్, శేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి



సాయిచరణ్ (ఫైల్)

బయ్యారం, జనవరి 16 : చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందగా, మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. బయ్యారం మండలం కస్తూరీనగరం గ్రామానికి చెందిన బాధవత్ శ్రీను 9 ఏళ్ల కుమారుడు సాయిచరణ్ 4వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలోనే ఈనెల 4వ తేదీన ఆడుకుంటూ ఇంట్లోని గడ్డి మందును పొరపాటున కూల్‌డ్రింక్ అనుకొని సేవించాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు సాయిచరణ్‌ను చికిత్స నిమిత్తం తొలుత మహబూబాబాద్ ఆస్పత్రికి, ఆ తరువాత ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం ఈనెల 7వ తేదీన హైదరాబాద్ తరలించారు. అక్కడ వైద్యం పొందుతున్న సాయిచరణ్ మంగళవారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి, మృతి చెందాడు. మృతుని తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా శ్రీను నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడం, వైద్య ఖర్చుల నిమిత్తం ఎక్కువ మొత్తంలో డబ్బులు కావాల్సి రావడంతో ఆ గ్రామంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన పలువురు దాతలు ఎలాగైన బాలుని ప్రాణాలు నిలబెట్టేందుకు విరాళాల రూపంలో కొంత డబ్బు సేకరించినప్పటికి ఫలితం లేకపోయింది.

బావిలో పడి వ్యక్తి మృతి



ఎడెల్లి సతీష్ రెడ్డి (ఫైల్)

బయ్యారం, జనవరి 16 : ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందగా, సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు. జగ్గుతండాకు చెందిన ఎడెల్లి సతీష్‌రెడ్డి (36) లారీ డ్రైవర్‌గా పనిచేస్తాడు. సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఇంటి వద్ద కుటుంబసభ్యులతో గడుపుతున్న సతీష్‌రెడ్డి మధ్యాహ్న సమయంలో ఫోన్ మాట్లాడుకుంటూ మూత్ర విసర్జనకని బయటకు వెళ్లాడు. ఇంటి సమీపంలోని వ్యవసాయ బావివద్ద మూత్ర విసర్జన చేస్తున్న సతీష్‌రెడ్డి ప్రమాదవశాత్తు జారీ బావిలో పడ్డాడు. సతీష్ రెడ్డికి ఈత రాకపోవడంతో బావిలో నుంచి బయటకు రాలేక మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు వెల్లడించారు.

ఆరుగురిపై కేసు నమోదు

కొత్తగూడ, జనవరి 16 : ఒకరిపై దాడిచేసి తీవ్రంగా గాయపరచిన ఘటన వేలుబెల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన ఉల్లెంగుల రమేష్ ఇంటిలో దుకాణం నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి దుకాణం వద్దకు పలువురు రమేష్‌తో వాగ్వాదానికి దిగి రమేష్‌పై దాడిచేశారు. తలపై సీసాతో కొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. రమేష్‌ను ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రమేష్ భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గట్టి కమలాకర్, గట్టి వేణు, ఈక సోమేశ్వర్, పెంతల రాజేంద్రప్రసాద్, దనసరి శ్రీను, చుంచ బాలరాజుపై కేసున మోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పథకాలను వినియోగించుకోవాలి

మరిపెడ, జనవరి 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి కోసం అందించే సబ్సిడీ పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మరిపెడ ఎస్బీఐ మేనేజర్ రాంచంద్రమూర్తి అన్నారు. మంగళవారం వికసిత సంకల్పయాత్రను ఆయన పట్టణంలోని ఎస్బీఐ దగ్గర ప్రారంభించి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిరుద్యోగ యువత కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. అర్హులైన యువతీ, యువకులు బ్యాంకు నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసినట్లయితే వారికి రుణ సౌలభ్యం కలిపిస్తామని పేర్కొన్నారు. ప్రొజెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై స్థానిక ప్రజలకు సంకల్ప యాత్ర నిర్వాహకులు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, వికసిత సంకల్ప భారత్ మండల కోఆర్డినేటర్ ఎస్కే. షబ్బీర్, బీజేపీ నాయకులు బుల్లెట్ కృష్ణ, లింగంనాయక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 : ప్రభుత్వ భూముల్లో నిలువ నీడలేని పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు, గౌతమ బుద్ధకాలనీ అధ్యక్షుడు సురుగు ఐలయ్య విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ శివారు గౌతమబుద్ధకాలనీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిధిలోని సర్వేనెంబరు 287, 255/1, 551లలో గుడిసెలు వేసుకున్న పేదలపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసకుని నివసిస్తున్న పేదలకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. గంధం శ్రీరాములు, ఉప్పలయ్య, వీరభద్రం, సహదేవ్, రాజేశ్వరీ, భూపతిరావు, ప్రమీళ, రత్నమ్మ పాల్గొన్నారు.

'పదవుల్లో అవకాశం కల్పించాలి'

కేసముద్రం, జనవరి 16 : ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్నానని, తనకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కేసముద్రం మండలం కాట్రపల్లికి చెందిన టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రెండుసార్లు ఎమ్మెల్యే టికెట్ అడిగి పార్టీ ఆదేశాల మేరకు అభ్యర్థికి మద్దతు ఇచ్చానని తెలిపారు. పార్టీకి విధేయుడిగా ఉంటున్న తనకు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ, ట్రైకార్, కేసముద్రం మార్కెట్ చైర్మన్లలో ఏదైనా ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.

సామూహిక పేరంటాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 16 : జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో మంగళవారం సామూహిక పేరంటాల కార్యక్రమం నిర్వహించారు. కనుమ పర్వదినాన మహిళలు ఒకరి ఇళ్లకు మరొకరు వెళ్లివాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం అనంతరం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక పేరంటాల కార్యక్రమాన్ని నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. చౌదవరపు మంజువాణి, సుజాత, తోర్నాల నాగమణి, చంద్రకళ, అరుంధతి, తల్లాడ శ్రీదేవి, చీదర ధనలక్ష్మీ, దేవాలయ కమిటీ సెక్రటరీ యిమ్మడి రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలి

పెద్దవంగర, జనవరి 16 : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ నాయకులు ప్రజలకు తెలియాజేయాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సరేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాజీ పీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ జడ్పీఫ్లోర్ లీడర్, సర్పంచ్ ఎన్.ప్రవీణ్‌రావు, జాటోతు నెహ్రూనాయక్, మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, సీనియర్ నాయకులు దుంపల శ్యామ్, తోటకూరి శ్రీనివాస్, గోపాల్, వెంకన్న, ఉపేందర్, రవి, శ్రీనివాస్, సోమాచారి, తన్నీరు వేణు, యాకన్న, రవి, సుధీకర్, స్వామి, సందీప్, సంతోష్, సాయి, సతీష్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు రాజీవ్‌నగర్ కాలనీలో రోడ్డుపక్కన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ 17వ వార్డు సభ్యులు వి.భద్రం, రంజిత్, చిరంజీవి, రాజమ్మలు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాజీవ్‌నగర్ కాలనీలో నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ ఫ్లెక్సీలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, సమీపంలో సీసీ కెమెరాల ఆధారంగా ధ్వంసం చేసిన గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటింటా సంక్రాంతి

(5వ పేజీ తరువాయి)

టగ్ ఆఫ్ వార్, పతంగుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ వెన్నాకుల వాణి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

- బయ్యారం, రామగుండాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.
- నర్సింహులపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దనాగారంలో ఎంపీపీ సుశీల, పడమటిగూడెంలో జడ్పీటీసీ భూక్య సంగీత పాల్గొన్నారు.
- కురవి మండలం నేరడలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కబడ్డీ చ వాలీబాల్, క్రికెట్ క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్పంచ్ శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నీరుడు ప్రేమ్‌కుమార్, పోలెపాక ప్రశాంత్, ఎం.మధు, జక్కుల రమేష్, యాకన్న, ఇరుగు శ్రీను పాల్గొన్నారు.
- సీరోలు మండలం కాంపల్లి యుత్ ఆధ్వర్యంలో పెద్ది రంగయ్య, మేక మహేష్, నలభోతుల లచ్చిరెడ్డి స్మరకార్థం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెంకట్‌రెడ్డి, గంద్రాతి సత్యం, పొన్నం మహేష్, మల్లు వెంకటేశ్వర్లు, జక్కోజు రమేష్, గంద్రాతి మల్లయ్య, పెరుగు రాజు, రేపాల శేషు, నాగరాజు, శ్రీపాల్, లింగన్న, బయ్య శ్రీను, కృష్ణ, వీరన్న, మురళీ పాల్గొన్నారు.